## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

**కొల్లాపూర్:** రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి రామానందతీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఆసక్తి గల యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని శిక్షకుడు భీమయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ కోర్సులకు రెండు నెలల కాలం పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

### విద్యార్థుల ప్రతిభ



**లింగాల:** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో ఈ నెల 19న నిర్వహించిన అండర్–17 విభాగంలో ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలలో లింగాల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచారు. బుధవారం విద్యార్థులను హెచ్ఎం శేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

### మద్యం దుకాణాన్ని తరలించాలి

**ఉప్పునుంతల:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే చోటుకు మార్పు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్దం సైదులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వైన్ షాపు ఏర్పాటుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ, ఎక్సైజ్ అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

### బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



**కల్వకుర్తిరూరల్:** మండలంలోని మార్చాలలో వారం రోజుల సాయమ్మ, కిషోర్‌లు మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పన మొత్తం రూ10వేలు అందజేశారు. గ్రామ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నిజాం, భాస్కర్, జలాల్, సురేష్, గణేష్, పాల్గొన్నారు.

**వెల్దండ:** మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన చెట్ల యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం కాంగ్రెస్ నాయకుడు గున్నెళ్ల శ్రీనివాసులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు రమేష్, కృష్ణయ్య, చంద్రయ్య, ఎల్లయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ఉప్పునుంతల:** మండల కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అచ్చంపేటకు ట్రాక్టర్ ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. మండల కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ యజమాని అచ్చంపేటకు చెందిన ఎండీ రఫీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### గ్రామ కమిటీ ఎన్నిక

**చారకొండ:** మండలంలోని ఎర్రవల్లి గ్రామ గౌడ సంక్షేమ సంఘం నూతన కమిటీని బుధవారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పబ్బు పెద్దయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడు పర్వతాలు గౌడ్, రాంచంద్రయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా అంజనేయులు గౌడ్, కార్యదర్శిగా వెంకటయ్య గౌడ్ ఎన్నికయ్యారు.

### హామీలు అమలు చేయాలి

**కల్వకుర్తిరూరల్:** ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు 20 రోజుల ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు బీసీల అభివృద్ధి రూ.20 వేల కోట్లు కేటాయించాలని, 12 ఫెడరేషన్‌లలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు బీసీలకు ఇవ్వాలని పెద్దయ్య యాదవ్ పేర్కొన్నారు.

### యువకుడి మృతి: కేసు నమోదు

**వెల్దండ:** మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని జహంగీర్(29) మృతి చెందాడు. బుధవారం మృతుడి తండ్రి నిరంజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ కుమార స్వామి పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు.

# బిల్లులు అందక అవస్థలు



వెల్దండలో వంట చేస్తున్న నిర్వాహకులు

- వంట ఏజెన్సీలకు తప్పని వెతలు
- మూడు నెలలుగా ఎదురుచూపులు

**వెల్దండ:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజన ఏజెన్సీలకు బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. భోజనం చేసేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వంట నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి రోజు కూరగాయలు, గుడ్లు, పప్పులు, నూనె తదితర సామాగ్రి కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వంటశాలలు లేక..**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులకు భోజన శాలలు నిర్మించకపోవడంతో ఆరుబయటే భోజనం చేస్తున్నారు. మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ దాదాపుగా 450మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి రోజు మధ్యాహ్న భోజనం ఆరుబయట కూర్చొని తింటున్నారు. వర్షాకాలంలో తినేందుకు విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు.

**మండలంలో 50 పాఠశాలల్లో..**

మండలంలో మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 37, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ఉన్నత పాఠశాలలు 8 ఉన్నాయి. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 1130, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 606, 9వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 454మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి నెల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి 78 ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. మెనూ ప్రకారం భోజనం తయారు చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల వంట నిర్వాహకులు దాదాపుగా ప్రతి నెల రూ.2.81లక్షలు కూరగాయలు ఇతర ఖర్చులు, గుడ్లకు రూ.90 వేలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సకాలంలో బిల్లులు అందక వంట నిర్వాహకులు లక్షల్లో అప్పులు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

**అప్పులు చేసి..**

మండలంలోని వంట నిర్వాహకులు మూడు నెలలుగా బిల్లులు అందడం లేదు. ప్రతి నెల అప్పులు చేసి వంట నిర్వహకులు భోజనం తయారు చేస్తున్నారు. కొంత మంది షాపుల వద్ద, మరికొంత మంది వంట నిర్వాహకులు సొంత డబ్బులు పెట్టి వంటలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా వంట ఏజెన్సీలకు అందిస్తున్న గౌరవ వేతనాలు సకాలంలో అందడం లేదని వాపోయారు. మూడు నెలల గౌరవ వేతనాలు, గుడ్ల ఖర్చు, వంట సామగ్రి బిల్లులు దాదాపుగా రూ.1.81కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు.

#### అప్పులు చేసి సామగ్రి కొనుగోలు



మోడల్ హైస్కూల్ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నాం. నిధుల రాక పోవడంతో అప్పులు చేసి కిరాణ సామగ్రిని కొనుగోలు చేస్తున్నాం. ప్రతి నెల పాఠశాలల్లో రూ.40వేల నుంచి రూ. 50వేల బిల్లు అవుతుంది. ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్తే ఉన్నతాధికారులకు పంపించాం అంటున్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

–లక్ష్మమ్మ, వంట నిర్వాహకురాలు, వెల్దండ

#### మూడు నెలలుగా..



వంట ఏజెన్సీలకు మూడు నెలలు నుంచి వేతనాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. సకాలంలో బిల్లులు అందక, అటు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నత అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించి కాదుకోవాలి.

–యాదమ్మ, వంట నిర్వాహకురాలు, వెల్దండ

#### బిల్లులు మంజూరు కాలేదు



ఎప్పటికప్పుడు ఖర్చుల వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. బడ్జెట్‌ను బట్టి బిల్లులు మంజూరు అవుతాయి. మూడు నెలలు బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసిన వెంటనే నిర్వాహకుల బ్యాంక్‌ల ఖాతాలో జమచేస్తాం.

–శంకర్‌నాయక్, ఇన్‌చార్జ్ ఎంఈఓ, వెల్దండ

### పోటీ పరీక్షలతో విద్యా సామర్థ్యం మెరుగు

**కందనూలు:** పోటీ పరీక్షలతో విద్యార్థుల సామర్థ్యం మెరుగు పడుతుందని డీఈఓ గోవిందరాజులు అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తెలంగాణ గణిత ఫోరం అధ్యక్షులు కందికొండ శ్రీనివాస్ కలిసి డీఈఓ బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 126 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ బహుమతి రూ.1500, ద్వితీయ బహుమతి రూ.1000, తృతీయ బహుమతి రూ.500 తో పాటు సర్టిఫికెట్లతో అభినందించారు. కార్యక్రమంలో మిడిదొడ్డి వారి సేవ సంస్థ అధ్యక్షుడు శివశంకర్, పరీక్షల విభాగం అధికారి రాజాశేఖర్ రావు, సైన్స్ అధికారి ఏ కృష్ణారెడ్డి, ఏఎంఓ షర్ఫుద్దీన్, జి లత తదితరులు పాల్గొన్నారు.

### బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే



**తెలకపల్లి:** మండలంలోని బొప్పల్లి, జంగమోనిపల్లి గ్రామాల్లో తెలంగాణ సమగ్ర శిక్షా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. బొప్పల్లిలో ఇటీవల బడి మానివేసిన విద్యార్థి యాదగిరిని గుర్తించి తిరిగి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కుమార్ మాట్లాడుతూ బడి ఈడు ఉండి బడి బయట ఉన్న పిల్లలందరిని బడిలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామేశ్వర్‌రావు, రిసోర్స్‌పర్సన్ శ్యాంసుందర్, ఎన్‌క్లోజివ్ ఎడ్యుకేషన్ సెస్ సర్సన్ రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం



**లింగాల:** ఐక్యతతోనే ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని బీసీ నాయకులు రాజలయ్య, శివ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 27న మండల కేంద్రంలో మండల స్థాయి బీసీ ఐక్య వేదిక సదస్సును నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యలను ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేయాల్లని కోరారు.

### డిజిటల్ సేవలు ప్రారంభం



**కోడేరు:** మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో డిజిటల్ సేవ కామన్ సర్వీస్ సెంటర్‌ను సింగిల్ విండో చైర్మన్ బర్ల చిన్నారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ ప్రకాశ్‌రెడ్డి, ఖాజా, ఖాన్, మహేష్, వైస్ చైర్మన్ శివ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### బీమా బాండ్ల పంపిణీ



**లింగాల:** మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం రేంజ్ పరిధిలోని బేస్ క్యాంపు వాచర్లకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు విలువ చేసే జీవితబీమా బాండ్లను ఎఫ్‌డీఓ తిరుమల్ రావు, ఎఫ్ఆర్వో వీరేశం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాల రేంజ్ పరిధిలో ఉన్న 15 మంది బేస్ క్యాంపు వాచర్లకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధి పనులపై నిరంతర పర్యవేక్షణ

**చారకొండ:** గ్రామాల్లో ఉపాధి పనులపై నిరంతర పర్యవేక్షణ చేపడుతామని అంబుడ్స్ పర్సన్ జంగయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఎంపీడీఓ జయసుధ వారంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కూలీల పని దినాలను పెంచి ఉపాధి కల్పించాలన్నారు. సోషల్ ఆడిట్‌లో పెండింగ్ వివరాలను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ నర్సరీల పనులను పూర్తి చేసి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులు ఉన్నారు.

### అనాథ పిల్లలకు ఆర్థికసాయం



**కోడేరు:** మండలంలోని ఎత్తం గ్రామానికి చెందిన పార్వతమ్మ వారం రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందగా ఆమె భర్త గతంలోనే మరణించాడు. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్ యాదవ్ రూ.10వేలు, సింగిల్ విండో డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి రూ.10వేలు, మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. అనాథ పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య పాల్గొన్నారు.

### విద్యుత్ కోతతో నిలిచిన ధరణి సేవలు

**కోడేరు:** మండల కేంద్రంలోని విద్యుత్ కోతతో ధరణి సేవలు బుధవారం నిలిచిపోయాయి. రెండు రోజుల నుంచి విద్యుత్ కోత ఉండటంతో తహసీల్దార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులు కార్యాలయం ఎదుట పడిగాపులు పడ్డారు.

### క్రిస్మస్ నిర్వాహక కమిటీ ఎన్నిక

**కొల్లాపూర్ రూరల్:** పట్టణ ఆర్డీఓ కార్యాలయంలో డీటీ హిమబిందు ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ నిర్వాహక కమిటీ ఎన్నుకున్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి పాస్టర్స్‌లు హాజరయ్యారు. కమిటీ అధ్యక్షుడిగా శాలెంరాజ్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి దాసు, కార్యవర్గ సభ్యులుగా అజయ్‌కుమార్, రాజు, సామేలు, కొళ్ల రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు జాన్సన్‌లు ఎన్నికయ్యారు. ఈ నెల 23న క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు అధ్యక్షుడు శాలెంరాజు తెలపారు. కార్యక్రమంలో సిబ్బంది, పాస్టర్లు పాల్గొన్నారు.

### సైబర్‌నేరాలపై అవగాహన

**వెల్దండ:** మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్‌నేరాలపై బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ కౌసల్య మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అదే విధంగా బ్యాంక్ ఖాతానంబర్లు, ఆధార్, పాన్ నంబర్లు చెప్పొద్దన్నారు. సైబర్ మోసాలపై కుటుంబ సభ్యులకు వివరించాలన్నారు. మహిళలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

### ఆధ్యాత్మికతతో ప్రశాంతత

**పెద్దకొత్తపల్లి:** ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అయ్యప్ప మాలధారుడు అశోక్ స్వామి నివాసంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడిపూజకు ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు తిరుపతయ్య స్వామి, వెంకటస్వామి, నరేష్‌స్వామి, నవీన్ స్వామి, మహిళలు పాల్గొన్నారు.

### బస్సు సౌకర్యం కల్పించాలి



**వెల్దండ:** మండలంలోని కుప్పగండ్ల మీదుగా ఆమనగల్లు వరకు బస్సు సౌకర్యం కల్పించాలని బుధవారం విద్యార్థులు కల్వకుర్తి డీఎం సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమనగల్లు, కల్వకుర్తి పట్టణాలకు వెళ్లి చదువుకునేందుకు ఇబ్బందులు ఎదరవుతున్నాయని వివరించారు. గతంలో కల్వకుర్తి డీపో నుంచి కుప్పగండ్ల, గొల్లోనిపల్లి, చౌదర్‌పల్లి మీదుగా ఆమనగల్లు పట్టణానికి ఉదయం, సాయంత్రం బస్సు రాకపోకలు ఉండేవని పేర్కొన్నారు. మళ్లీ పాత రూట్‌లోనే బస్సును పునరుద్ధరణ చేయాలని కోరారు. రూట్ సర్వే చేసి బస్సును మంజూరు చేస్తామని డీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరమేష్‌గౌడ్, కళాశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

### పంట మార్పిడితో లాభాలు

**తాడూరు:** పంట మార్పిడితో లాభాలు పొందవచ్చని సర్పంచ్ నిరంజన్ అన్నారు. బుధవారం మండలంలోని అల్లాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాణ సదస్సులో ఏఈఓ, సర్పంచ్ మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చే వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు సలహాలు పాటించాలన్నారు.

### యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



**చారకొండ:** పంటల సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడి సాధ్యమని మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల క్లస్టర్‌లో బుధవారం ఆయన ఏఈఓతో కలిసి జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా రైతులకు ఉచితంగా అందించిన వేరుశనగ చిరుపొట్లాల కదిరి లేపాక్షి రకము పంటను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితులో వేరుశనగ పంటలో పాటించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, వివరించారు. పంట సస్య రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ వంశీ, రైతులు నిరంజన్, వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

### 10 లీటర్ల సారా పట్టివేత

**అచ్చంపేట రూరల్:** మండలంలోని గుంపన్‌పల్లి రోడ్డులో పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. బైక్‌పై 10 లీటర్ల సారాను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకునట్లు ఎక్సైజ్ ఎస్ఐలు బాల్‌రాజు, సతీష్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉషా పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న మంజుల

**మన్ననూర్:** అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మంజుల అన్నారు. బుధవారం వటువర్లపల్లి సర్పంచ్ చత్రునాయక్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ ఆవరణలో అడవులు, వన్యప్రాణులను రక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ మనుగడకు అడవులు, వన్య ప్రాణులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. అడవులు ఉంటే సకాలంలో వర్షాలు కురుస్తాయని అన్నారు. ప్రతి ప్రాణికి కూడా జీవించే హక్కు ఉందని వన్యప్రాణులకు హాని చేయొద్దని సూచించారు. పెద్దపులులు, చిరుతలు కనిపిస్తే అటవీశాఖ అధికారులు, సిబ్బందికి ఎవరికైన సమాచారం ఇవ్వాలని కోరారు. ఉప సర్పంచ్ అనసూయ, గ్రామ కార్యదర్శి రాంబాబు, వార్డు సభ్యులు సాలమ్మ, శ్రీను, రమేష్, అటవీశాఖ అధికారులు సిబ్బంది తేజశ్రీ, రాజేశ్వరి, శిల్ప, మాధవరెడ్డి, ముత్యాలు, శరత్, శ్రీనివాసులు, పరమేశ్వర్, సూర్యం, లాలయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా ఓటరు నమోదు



**పెంట్లవెల్లి:** గ్రామాల్లో పకడ్బందీగా ఓటరు నమోదు చేపడుతామని పెద్దకొత్తపల్లి డీటీ రమేష్ నాయక్, కొల్లాపూర్ డీటీ ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తప్పులు లేకుండా ఓటురు నమోదు నిర్వహించాలని సూచించారు. మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ హనుమంతు, శివన్న గౌడ్, మండల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

### అయోధ్య రాముడి అక్షతల ఊరేగింపు



**మన్ననూర్:** అయోధ్య రాముడి అక్షతలను బుధవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో ఊరేగించారు. ఆలయం ప్రధాన ద్వారం వెలుపల అక్షితలకు కొబ్బరి కాయలు కొట్టి దూపదీప నైవేధ్యాలు కుంకుమార్చనలు సమర్పించారు. గురు, శుక్ర వారాల్లో భక్తులకు అక్షతలు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో భక్తులు సత్యనారాయణ, సంబు శోభ, శేఖర్, గంగాజీ, జయమ్మ, సరస్వతి, ప్రభావతమ్మ, భాగ్యమ్మ, పద్మ పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే ధ్యేయం



**మన్ననూర్:** ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ అన్నారు. బుధవారం అమ్రాబాద్ మండలంలో పలు గ్రామాల్లో వివిధ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, నాయకులు వెంకటరమణ, ఇస్మాయిల్, జయమ్మ, బాబ తదితరులు పాల్గొన్నారు.

### రెమ్యూనరేషన్ చెల్లించాలి



**కందనూలు:** గత పదో తరగతి పరీక్ష స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాల్లో పనిచేసిన ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ చెల్లించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఈఓ గోవిందరాజులకు వినతి పత్రాన్ని సమర్పించారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

### విద్యార్థుల ప్రగతిపై నిర్లక్ష్యం వహించొద్దు

**ఉప్పునుంతల:** విద్యార్థుల ప్రగతిపై నిర్లక్ష్యం వహించొద్దని కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం కాంప్లెక్స్ పరిధిలోని తిర్మలాపూర్, కాంసానిపల్లి, గట్టుకాడిపల్లి, ఉప్పునుంతల, తాడూరు, మర్రిపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎఫ్ఎల్ఎన్‌టీంతో కలిసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ టీం సభ్యులు విజయకుమార్, నరసింహ్మారెడ్డి, అమీర్ పాషా, భాస్కర్, హెచ్ఎంలు ఉన్నారు.

### మిరప పంటపై క్షేత్ర ప్రదర్శన

**తాడూరు:** మండలంలోని ఇంద్రకల్‌లో ఏఓ సాయి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మిరప పంటపై బుధవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. హనుమాన్ 167 రకంపై నిర్వహించిన క్రాప్‌వెల్ సీడ్స్‌పై అవగాహన కల్పించారు. ఇంద్రకల్‌తో పాటు ఐతోలు, యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు, గగ్గలపల్లి గ్రామాల్లో రైతులు మిరప పంట అధికంగా సాగు చేశారన్నారు. అధిక దిగుబడి సాధించేందుకు క్రాప్ వెల్ సీడ్స్ ద్వారా సాగు చేయాలన్నారు. సర్పంచ్ రమణ, రైతులు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

### నర్సరీల పరిశీలన



**కల్వకుర్తిరూరల్:** మండలంలోని యంగంపల్లిలో బుధవారం నర్సరీలను ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని నిర్వాహకులకు సూచించారు. మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### నిబంధనలు ఉల్లంఘించొద్దు



**కొల్లాపూర్:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు డీలర్లకు సూచించారు. బుధవారం పట్టణంలోని రైతువేదిక భవనంలో ఎరువులు విక్రయించే డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నకిలీ ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాలకు చెందిన ఎరువులు, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.

### సీపీఎం నాయకుడు వెంకట్‌రెడ్డికి నివాళి

**కల్వకుర్తి రూరల్:** పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో సీపీఎం సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి నాల్గో వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి గోపాల్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజల పక్షాన నిలబడి వెంకట్‌రెడ్డి ఎన్నో పొరాటాలు చేశారని కొనియాడారు. అదేవిధంగా యూటీఎఫ్, సీఐటీయూ, కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు నివాళి అర్పించారు. అదేవిధంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. బుధవారం మండలంలోని మార్చాలలో వెంకట్‌రెడ్డి స్తూపం వద్ద ఆయన నివాళులర్పించారు. వెంకట్ రెడ్డి సతీమణి విజయలక్ష్మి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చిన్నయ్య, అంజనేయులు, పరుశరాములు, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, పాండయ్య తదితరులు పాల్గొన్నారు.